తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..

# సంక్రాంతి వేళ హైదరాబాద్ మెట్రో బంపర్ ఆఫర్

**తెలంగాణ వీణ, జనరల్ :** సంక్రాంతి వచ్చిందంటే జనాల్లో జోష్ మామూలుగా ఉండదు. భోగి, సంక్రాంతి, కనుమ... ఇలా మూడ్రోజులూ ఎంతో విశిష్టత ఉన్న పర్వదినాలు కావడంతో సంబరాలకు కొదవ ఉండదు. ఇక, హైదరాబాదులో అయితే ఈ మూడ్రోజులు సెలవు దినాలు కావడంతో ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లిపోతారు. దాంతో నగరం చాలావరకు ఖాళీగా కనిపిస్తుంది. ఈసారి కూడా అందులో పెద్ద తేడా లేదు. నగరం బోసిపోయినట్టు కనిపిస్తోంది. చూద్దామన్నా రోడ్లపై రద్దీ కనిపించడంలేదు. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో బంపర్ ఆఫర్ ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని పెంచుకోవడం కోసం... అన్లిమిటెడ్ ప్రయాణ సౌకర్యాన్ని తీసుకువచ్చింది. సూపర్ సేవర్ కార్డును రూ.59తో రీచార్జ చేయించుకుంటే చాలు... మెట్రోలో ఒక రోజంతా ఎక్కడ్నించి ఎక్కడికైనా అపరిమితంగా ప్రయాణించవచ్చు.



ఈ నెల 13 నుంచి 15 వరకు ఈ సదుపాయం అమల్లో ఉంటుంది. మెట్రో రైల్వే స్టేషన్లలోని కౌంటర్లలో ఈ సూపర్ సేవర్ కార్డులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్ మెట్రో సూపర్ సేవర్ కార్డులను ఎప్పటినుంచో ఇస్తోంది. ఈ కార్డును ఒకసారి కొనుగోలు చేయాలంటే రూ.109 చెల్లించాలి. ఇప్పుడు ఈ కార్డును రూ.59తో రీచార్జ్ చేసుకుంటే అన్ లిమిటెడ్ ప్రయాణ సౌకర్యాన్ని పొందుతారు.

# 100 లోక్‌సభ స్థానాలు.. 15 రాష్ట్రాలు.. 67 రోజులు..

**తెలంగాణ వీణ, జనరల్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' నేడు మణిపూర్ నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్ర మొత్తం 15 రాష్ట్రాలు, 100 లోక్‌సభ స్థానాలు, 110 జిల్లాల మీదుగా సాగుతుంది. 6,700 కిలోమీటర్లు సాగనున్న ఈ యాత్ర మొత్తం 67 రోజులపాటు కొనసాగుతుంది. అలాగే, 337 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా యాత్ర సాగుతుంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ యాత్ర గురించి కాంగ్రెస్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 10 ఏళ్ల 'అన్యాయ్ కాల్'కి వ్యతిరేకంగా జరుగుతున్న యాత్రగా దీనిని అభివర్ణించింది. ఈశాన్య రాష్ట్రంలో ప్రారంభమవుతున్న ఈ యాత్ర మార్చి 20న మహారాష్ట్రలో ముగుస్తుంది.






**ఉత్తరప్రదేశ్‌లో 1,074 కిలోమీటర్లు:**

రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర ఎక్కువ భాగం ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతుంది. రాష్ట్రంలోని 20 జిల్లాల మీదుగా 1,074 కిలోమీటర్లపాటు 11 రోజులపాటు సాగుతుంది. ఝార్ఖండ్, అస్సాంలో 8 రోజుల చొప్పున, మధ్యప్రదేశ్‌లో 7 రోజులపాటు యాత్ర కొనసాగుతుంది. మరీ ముఖ్యంగా రాజకీయంగా అత్యంత ముఖ్యమైన యూపీలోని అమేథీ, రాయ్‌బరేలీతోపాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నియోజకవర్గం వారణాసిలోనూ రాహుల్ పాదయాత్ర కొనసాగుతుంది. బీహార్‌లో ఏడు జిల్లాలు, ఝార్ఖండ్‌లో 13 జల్లాలను కవర్ చేసే రాహుల్ యాత్ర ఆయా జిల్లాల్లో వరుసగా 425 కిలోమీటర్లు, 804 కిలోమీటర్లు కొనసాగుతుంది.

# మాంజా దారం మెడకు చుట్టుకొని సైనికుడు మృతి

**తెలంగాణ వీణ , జనరల్ :** హైదరాబాద్‌లో విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి. సంక్రాంతి పండుగ వేళ ఎగురవేస్తున్న పతంగులతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి చెందడంతో పండుగ వేళ విషాదం అలుముకున్నది. పతంగులు ఎగురవేస్తూ భవనంపై కింద పడి యువకుడు తుదిశ్వాస విడిచారు. మాంజాదారం మెడకు చుట్టుకొని తీవ్ర గాయాలతో సైనికుడు ప్రాణాలను విడిచాడు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నంకు చెందిన సైన్యంలో సేవలందిస్తున్న కోటేశ్వరరావు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. విధులు ముగించుకొని ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో లంగర్‌హౌస్‌పై వద్ద మెడకు మాంజా చుట్టుకున్నది. దీంతో కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయను ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలకు గురైన ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే అల్వాల్‌లో యువకుడు భవనంపై నుంచి కిందపడ్డాడు. మృతుడిని పేట్ బషీర్‌భాగ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ తనయుడు ఆకాశ్‌గా గుర్తించారు. పతంగుల కారణంగా గత రెండురోజుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పండుగ వేళ మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. చైనా మాంజాపై నిషేధం ఉన్న నిబంధనలకు విరుద్ధంగా పలువురు విక్రయిస్తున్నారు. పతంగులను ఎగురవేస్తూ ఇష్టారాజ్యంగా వదిలివేస్తుండడంతో మాంజాదారం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, పక్షులు సైతం బలవుతున్నాయి.





# పండుగ పూట విషాదం.. కారు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తెలంగాణ వీణ , జనరల్ :** పండుగ పూట హుస్నాబాద్ పట్టణంలో విషాదం నెలకొంది. హుస్నాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలోపట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన ఎగ్గోజు యశ్వంత్(17)అనే వ్యక్తి మృత్యువాత పడ్డాడు. మరో ముగ్గురు తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఎగ్గోజు యశ్వంత్ తన స్నేహితులు నారోజు వెంకటేశ్, ఎగ్గోజు అఖిల్, కేమసారం అజయ్‌లతో కలిసి వ్యాగనార్ కారులో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంతో ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పారు. దీంతో కారు సుమారు నాలుగుసార్లు పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది.క్షతగాత్రులను 108లో స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా యశ్వంత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో ముగ్గురు యువకులు చికిత్స పొందుతున్నారు. కారులో ఉన్న నలుగురు కూడా మైనర్లే కావడం విశేషం. వీరందరూ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు. భోగి పండుగ పూట యశ్వంత్ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. ఎస్ఐ తోట మహేశ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అయ్యప్ప దీక్ష స్వాముల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది

**తెలంగాణ వీణ . జనరల్ :** అయ్యప్ప దీక్ష స్వాముల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. దీక్షా విరమణ సమయంలోనూ ప్రత్యేక బస్సులు కేటాయించకపోవడంతో శబరిమల వెళ్లే స్వాములు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అయ్యప్పస్వామి దర్శన భాగ్యం లేక స్వాములు, భక్తులు నిరాశతో ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం గానీ, దేవాదాయశాఖ మంత్రి గానీ కనీసం సమీక్షలు చేసే పరిస్థితి కూడా లేదని సత్యప్రసాద్ విమర్శించారు. భక్తుల మనోభావాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వం వైపు నుంచి ప్రత్యేక చర్యలు లేకపోవడంతో వేలాది మంది స్వాములు, భక్తులు దర్శనం కాకుండానే వెనుదిరిగి వస్తుండటం బాధాకరం. గతంలో... రద్దీ ఉన్న సమయంలో బస్సుల కేటాయింపుతో పాటు, సంబంధిత అధికారులతో చంద్రబాబు నాయుడు మాట్లాడి సమస్య పరిష్కరించేవారు. ఒక ప్రత్యేక అధికారిని నియమించి శబరిమల వెళ్లి వచ్చే భక్తులపై శ్రద్ధ చూపించారు. రాష్ట్రం నుండి ప్రత్యేక రైళ్లను కూడా ఆనాడు ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పట్టించుకున్న పాపాన పోలేదు. వైసీపీ సభలకు ప్రత్యేక బస్సులు పెట్టి బలవంతంగా జనాన్ని తరలించడంపై ఉన్న శ్రద్ధ... అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బస్సులు కేటాయించడంపై లేదు. అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ వ్యవహారశైలి ఉంటోంది. ఆయా రాష్ట్రాల భక్తులకు సంబంధించిన ఏర్పాట్లను వారి రాష్ట్రాలు చూసుకుంటున్నప్పుడు... ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి... అయ్యప్ప స్వాములు, శబరిమల వెళ్లే భక్తుల సమస్య పరిష్కారానికి ముందుకు రావాలి. రాష్ట్రం నుండి అనేక వ్యయప్రయాసలతో శబరిమల వెళ్లి దర్శన భాగ్యం లేక వెనుదిరిగి వస్తున్నా ప్రభుత్వంలో ఒక్క మంత్రి కూడా స్పందించకపోవడం దేనికి సంకేతం.? శబరిమలలో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది గాయాలపాలైనా ప్రభుత్వం నుండి స్పందన లేదు. ఎలక్షన్... సెలక్షన్... కలెక్షన్ పై ఉన్న శ్రద్ధ.... ఈ ప్రభుత్వానికి అయ్యప్ప భక్తులపై లేదు. మకర సంక్రాంతి లోపైనా ప్రభుత్వం రవాణా సౌకర్యంపై చర్యలు తీసుకోవాలి. టీడీపీ అధికారంలోకి రాగానే శబరిమల వెళ్లే భక్తుల సమస్యలను పరిష్కరిస్తాం" అంటూ అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.



# అమెరికాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

**తెలంగాణ వీణ , జనరల్ :** ఉన్నత చదువుల కోసం కోటి ఆశలతో అమెరికా విమానం ఎక్కిన ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. అమెరికా వెళ్లిన రెండు వారాల్లోనే అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. రూమ్ లో ఆ యువకుడితో పాటు మరో యువకుడి మృతదేహాలను గుర్తించిన పోలీసులు.. ఇండియాలోని తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. బాధిత కుటుంబం వెల్లడించిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన గట్టు వెంకన్నకు ఒక కొడుకు, ఒక కూతురు.. డిగ్రీ పూర్తిచేసిన కొడుకు గట్టు దినేశ్ ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లాడు. పదహారు రోజుల క్రితం వెంకన్న కుటుంబంతో సహా ఎయిర్ పోర్టుకు వెళ్లి కొడుకుకు సెండాఫ్ ఇచ్చాడు. ఇంతలోనే దినేశ్ చనిపోయాడంటూ అమెరికా పోలీసుల నుంచి సమాచారం అందిందని వెంకన్న చెప్పాడు. దినేశ్ ఉంటున్న రూమ్ లో ఇద్దరు యువకుల మృతదేహాలను గుర్తించామని చెప్పారన్నాడు. తన కొడుకు దినేశ్ తో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో యువకుడు చనిపోయాడని, ఏం జరిగిందనే విషయం ఇంకా తెలియలేదని వివరించాడు. యువకుల మరణాలకు కారణమేంటనే విషయం ఇంకా తెలియరాలేదని పోలీసులు చెప్పారన్నాడు. కొడుకు చనిపోయాడని తెలియడంతో గట్టు వెంకన్న కుటుంబంలో విషాదం నెలకొంది.



# ఈసీఐఎల్ లో 1100 ఉద్యోగాలు..

**తెలంగాణ వీణ , జనరల్ :** హైదరాబాద్ లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తంగా 1100 జూనియర్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ పూర్తిచేసిన అభ్యర్థులు ఈసీఐఎల్ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేపట్టే ఈ నియామక ప్రక్రియకు ఈ నెల 16వ తేదీతో దరఖాస్తు ప్రక్రియ ముగియనుంది. తొలుత నాలుగు నెలల కాలానికి అభ్యర్థులను ఎంపిక చేసినా.. పనితీరు ఆధారంగా పొడిగింపు ఉంటుందని కంపెనీ వర్గాలు తెలిపాయి.

